క్లుప్తంగా

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: గర్భవతులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన సందర్శించారు. గర్భిణులు, చిన్నారులకు వేస్తున్న టీకాల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందితో డాక్టర్ మాట్లాడుతూ చిన్నారులకు వేయాల్సిన టీకాలు క్రమం తప్పకుండా వేయాలన్నారు. అనంతరం గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించండి



సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో

నగరి: ఓటు నమోదు కోసం అందజేసిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆర్డీవో వెంకటరెడ్డి ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి వచ్చిన దరఖాస్తుల తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులతో చర్చించారు. పరిశీలనా విధానంపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథ్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం పరిశీలన



వైద్య సేవలపై ఆరా తీస్తున్న మున్సిపల్ కమిషనర్

నగరి: మున్సిపాలిటీ పరిధిలోని నెత్తం కండ్రిగలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పరిశీలించారు. శిబిరానికి విచ్చేసిన రోగులకు వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. రోగులకు వైద్యం కిట్లు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కృష్ణమూర్తి, మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో జస్టిస్ నాగార్జునరెడ్డి



శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం ఎలక్ట్రిసిటీ బోర్డు రెగ్యులర్ అథారిటీ చైర్మన్, జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి, జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

మళ్లీ ఏనుగుల అలజడి

పాకాల: శివారు ప్రాంతాల్లో ఏనుగుల అలజడితో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. బుధవారం ఉదయం నుంచి మండలంలోని కాకర్లవారిపల్లి సమీప ప్రాంతాల్లో ఉన్న మామిడి తోటల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోందని, అటువైపు వెళ్లడానికి కూడా భయపడుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. మంగళవారం రాత్రి ఐరాల మండలం చుక్కావారిపల్లి పరిసర ప్రాంతాల్లో సంచరించిన ఏనుగుల గుంపు ప్రస్తుతం పాకాల మండల పరిసర ప్రాంతాల్లో మకాం వేశాయి. సంబంధిత అధికారులు స్పందించి ఏనుగుల గుంపును తరిమి ఎలాంటి నష్టం జరగకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

తుడా ఇన్‌చార్జి వీసీగా వెంకటనారాయణ

తిరుపతి తుడా: తుడా సెక్రటరీ వెంకటనారాయణ ఇన్‌చార్జి వైస్ చైర్మన్‌గా బుధవారం అదనపు బాధ్యతలను స్వీకరించారు. అనంతరం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కలిశారు. తుడా వీసీ హరికృష్ణ టీటీడీకి బదిలీ అయ్యారు. ఈ క్రమంలో వీసీ పోస్టు ఖాళీ అవ్వడంతో సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న వెంకటనారాయణకు ఇన్‌చార్జి వీసీ బాధ్యతలను అప్పగించారు.

జగనన్న బలం మహిళలే

- వైఎస్సార్‌సీపీ విజయం.. మహిళల విజయం
- మంత్రి ఆర్కేరోజా
- 4వ విడత వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ



విజయపురంలో వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్కే రోజా

విజయపురం (నగరి): మహిళలే జగనన్న బలమని, వైఎస్సార్ సీపీ విజయం.. మహిళల విజయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి ఆర్.కె.రోజా తెలిపారు. ఆమె బుధవారం విజయపురం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబానికీ కొడుకులా, అన్నలా, తమ్ముడిలా ఆదుకుంటున్నారని వివరించారు. ఎక్కడ మహిళలు సంతోషంగా వుంటారో అక్కడ దేవతల ఆశీర్వాదం ఉంటుందని పెద్దలు చెబుతుంటారని, గతంలో వైఎస్సార్, ప్రస్తుతం జగనన్న ముఖ్యమంత్రులు కావడానికి అక్కచెల్లెమ్మలే కారణమన్నారు. అందుకే మహిళలను తమ సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తున్నారని గుర్తు చేశారు. మహిళలకు పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తున్నారని పేర్కొన్నారు. పిల్లలు బాగా చదువుకుని పోటీ ప్రపంచంలో తట్టుకుని నిలబడే విధంగా విద్యలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. విద్యాకానుక ద్వారా యూనిఫారం, పుస్తకాలు, జగనన్న గోరుముద్ద ద్వారా పౌష్టికాహారం, ఇంగ్లీష్ మీడియంతో బైజూస్ కంటెంట్ ద్వారా మంచి విద్యను అందిస్తున్నారని వివరించారు. పిల్లల్ని పాఠశాలలకు పంపించడానికి అమ్మ ఒడి ఇచ్చి ఆర్థికంగా అండగా నిలుస్తున్నారని తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసి ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకువచ్చారని తెలిపారు. అన్ని రకాల వైద్య పరీక్షలు ఇళ్ల వద్దే చేస్తున్నారని తెలిపారు.

635 సంఘాలకు రూ.5.65 కోట్లు

విజయపురం మండలంలో 635 సంఘాల్లో 7,170 మంది సభ్యులు ఉన్నారని, వారికి నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.5.65 కోట్లు అందజేస్తున్నట్టు తెలిపారు. గతంలో మూడు విడతల్లో రూ.16.80 కోట్లు ఇచ్చినట్టు గుర్తు చేశారు. ఒక్క ఆసరా పథకం కింద నాలుగు సంవత్సరాల్లో నాలుగు విడుతలుగా జగనన్న ఇచ్చిన మాట ప్రకారం రూ.22.65 కోట్లు అందజేసినట్టు పేర్కొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి ఆర్కే రోజా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా

గర్భిణులకు అన్నదానం



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న వైద్యులు

నగరి: వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా పౌష్టికాహారం అందజేశారు. గర్భధారణ పరీక్షల సమయంలో ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చే వారు భోజనానికి ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఉచిత భోజనం అందించే మహత్తర కార్యక్రమాన్ని మంత్రి ఆర్కేరోజా నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. గర్భిణులతో పాటు వారి వెంట వచ్చే వారికి కూడా ఉచితంగా వెజిటబుల్ రైస్, గుడ్డు, పుదీనా చట్నీ, చిక్కీ, అరటిపండు, రైతాతో కూడిన పౌష్టికాహారం అందజేస్తున్నారు. మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి, వైద్యులు కార్తీక్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి

ఏర్పేడు: సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఏర్పేడులోని శివ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో జగనన్నకు చెబుదాం మండల కార్యక్రమం జరిగింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. గుడిమల్లం రెవెన్యూలో ఏళ్ల తరబడి స్థానిక రైతులు సాగు చేసుకుంటున్న ఇనాం భూములకు పట్టాలు అందజేయాలని పరశురామేశ్వర స్వామి ఆలయ చైర్మెన్ నరసింహ యాదవ్, రైతులు ఆర్డీఓకు అర్జీ అందజేశారు. మొత్తం 28 సమస్యలపై అర్జీలు అందగా, వాటిలో 22 రెవెన్యూ, 6 ఇతర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ గిడ్డయ్య చెప్పారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఆర్డీఓ తెలిపారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివయ్య, ఎంఈఓ ప్రేమలత, పశు వైద్యురాలు శిల్పారెడ్డి, ఏఓ షణ్ముగం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆరోగ్యం

శ్రీరంగరాజపురం: ప్రకృతి వ్యవసాయంతో సాగు చేస్తున్న బియ్యం, కూరగాయలను ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని నగరి డివిజన్ ఏడీఏ వాసు తెలిపారు. బుధవారం మంగుంటలో రైతులు సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని శాస్త్రవేత్త ఝాన్సీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలతో పండించిన బెల్లాన్ని టీటీడీకి సరఫరా చేస్తామన్నారు. మార్కెట్ ధర కన్నా ఎక్కువగా కొనుగోలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ నాంచారమ్మ, కవిత, శేషాద్రిరెడ్డి, సుబ్రమణ్యరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ విజేతకు అభినందనలు



విద్యార్థిని ఆశను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుత్తూరు: తిరుపతి జిల్లా ఇన్‌స్పైర్ మనక్ ప్రదర్శనలో రాష్ట్ర స్థాయికి అర్హత సాధించిన విద్యార్థిని ఆశను ఆదర్శంగా తీసుకోవాలని సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ కె.ధనుంజయ సారధి సూచించారు. గోపాలకృష్ణాపురం జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం విద్యార్థిని అభినందించారు. ఈ నెల 10, 11 తేదీల్లో శ్రీకాళహస్తిలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో 10వ తరగతి విద్యార్థిని వి.ఆశ గైడ్ టీచర్ విజయకుమారి పర్యవేక్షణలో వై మై మదర్ లూసింగ్ హర్ టీత్ వైల్ కటింగ్ షాంపూ సాచెట్స్ అనే ప్రాజెక్టును ప్రదర్శించింది. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుబ్బరాయన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నదాతకు ఉపయోగకరం రైతు బజారు

- రైతులకు గిట్టుబాటు ధర... ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన కూరగాయలు
- రూ.45 లక్షలతో 72 దుకాణాలు ఏర్పాటు



రైతు బజారును ప్రారంభిస్తున్న తుడా చైర్మన్

తిరుపతి రూరల్: రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వినియోగదారులకు నేరుగా విక్రయించేందుకు రైతు బజార్లు అన్నదాతలకు మేలు చేస్తాయని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తిరుచానూరు మార్కెట్ యార్డ్ ఆవరణలో రూ.45 లక్షలతో నిర్మించిన తిరుచానూరు రైతు బజారును ఆయన ప్రారంభించారు. దుకాణదారుల నుంచి కూరగాయలను కొనుగోలు చేశారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచనల మేరకు రైతులు, వినియోగదారుల కోసం రైతు బజారు నిర్మాణానికై చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఎకరా స్థలంలో రైతు బజారు ఏర్పాటు అభినందనీయమని కొనియాడారు. చంద్రగిరి నియోజకవర్గంలో మొట్టమొదటి సారి రైతు బజారు నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. తిరుచానూరు రైతు బజారు మోడల్‌గా నియోజకవర్గంలో మరిన్ని రైతు బజార్ల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. మార్కెట్ యార్డులో ప్రారంభించిన రైతు బజారు తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాలకు చెందిన రైతులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. రైతు బజారు ఏర్పాటుకు మార్కెట్ యార్డ్ చైర్మన్ గణపతి నాయుడు చేసిన కృషిని కొనియాడారు. ఈ రైతు బజారును రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నియోజకవర్గ ప్రజల కోసం భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా తిరుచానూరు రైతు బజారు ఏర్పాటుకు సంకల్పించారన్నారు. ఉమ్మడి పద్మావతిపురం మాజీ సర్పంచ్ గణపతినాయుడు, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, చంద్రగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి జానకిరామ్, శ్రీనివాసపురం సర్పంచ్ పద్మావతి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహి పాల్గొన్నారు.

రేపు రథసప్తమి

తిరుపతి(అలిపిరి): టీటీడీ స్థానికాలయాల్లో శుక్రవారం రథసప్తమిని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుచానూరులోని పద్మావతి అమ్మవారు, తిరుపతిలోని గోవింద రాజస్వామి, కోదండరామ స్వామి, శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో రథసప్తమి పర్వదినం నిర్వహిస్తారు. ఏటా మాఘ శుద్ధ సప్తమినాడు సూర్యజయంతిని పురస్కరించుకొని టీటీడీ స్థానిక ఆలయాల్లో రథసప్తమి ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఆరోజు ఉదయం భానుని తొలి కిరణాలు సూర్యప్రభ వాహనంపై కొలువైన స్వామివారి నుదుటన, నాభి, పాదకమలాలపై ప్రసరించే అద్భుత దృశ్యాన్ని తిలకించడానికి భక్తులు ఎదురు చూస్తుంటారు. చంద్రగిరిలోని కోదండరామ స్వామి ఆలయంలో ఉదయం 8 గంటలకు తిరుచ్చిపై వీధి ఉత్సవం నిర్వహించనున్నారు.

పురాతన ఆలయాలకు మహర్దశ



కుమారస్వామి ఆలయం వద్ద పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఆలయాలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయాల అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. రూ.38 లక్షలతో ఏడుగంగమ్మల ఆలయ ఆధునీకరణ పనులు, రూ.2.90 కోట్లతో కుమారస్వామి ఆలయం(విజ్ఞానగిరి)లో మహా మండపం నిర్మాణం, శ్రీధర్మరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో రూ.70 లక్షలతో నిర్మించనున్న దుకాణ సముదాయానికి ఎమ్మెల్యే, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సంయుక్తంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో పురాతన ఆలయాలకు మహర్దశ కల్పించి పునర్నిర్మిస్తుంటే నాలుగేళ్లు తెర మరుగైన ఊరందూరుకు చెందిన నాయకులు తమకు ఉన్న ఇల్లు సరిపోలేదని మేడలు కట్టుకుంటూ ఆలయాలను ఎందుకు కడుతున్నారంటూ విమర్శలు చేయడం ఎంత వరకు సబబు అని తీవ్రంగా మండిపడ్డారు. బొజ్జల కుటుంబం 30 ఏళ్లు శ్రీకాళహస్తి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించి ఏనాడూ ఆలయాల అభివృద్ధికి, ప్రజలకు ఒక మంచి చేయలేదని, ఈ విషయం ప్రజలందరికీ తెలుసునని పేర్కొన్నారు. తన హయాంలో ఏడుగంగమ్మల జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటింప జేశామని, ఆర్డీవో కార్యాలయం తీసుకు వచ్చామని, పురపాలక సంఘాన్ని ఫస్ట్ గ్రేడ్‌కు తీసుకు వచ్చినట్లు స్పష్టం చేశారు. ఇవి టీడీపీ నాయకులకు కనిపించడంలేదా అని ఎద్దేవా చేశారు. పాలకమండలి సభ్యులు మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, రమాప్రభ, కొండూరు సునీత, లక్ష్మి, పసలసుమతి, చింతామణి పాండు, శ్రీదేవి పాల్గొన్నారు.

శ్రీరాముడిని తాకిన సూర్యకిరణాలు



పాకాల: దామలచెరువులో కొలువుదీరిన పురాతన శ్రీసీతా రామాంజనేయ స్వామి ఆలయంలో సూర్యకిరణాలు నేరుగా శ్రీరాములవారి మూల విరాట్ విగ్రహంపై పడుతున్నాయి. బుధవారం ఆలయంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మాఘమాసం సందర్భంగా నెల మొత్తం సూర్యుని కిరణాలు స్వామివారి విగ్రహాన్ని తాకుతాయని, ఈ అద్భుతాన్ని చూసేందుకు స్వామివారి కృపకు పాత్రులయ్యేందుకు భక్తులు ఆలయానికి తరలి రావాలని ఆలయ నిర్వాహకులు పిలుపునిచ్చారు. సూర్య కిరణాలు స్వామివారి విగ్రహంపై పడే సమయంలో సూర్యకిరణాభిషేకం సేవలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని, సూర్యకిరణ పూజలు పూర్తిగా వాతావరణంపై ఆధారపడి ఉంటాయని గుర్తు చేశారు. సూర్య కిరణాలు శ్రీరాములస్వామి మూలవిరాట్‌ను తాకడంతో ఉత్తరాయణం వరకు భగవంతుడు సూర్యతేజస్సులో ఉంటాడని, భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని తెలిపారు. శుక్రవారం రథసప్తమి సందర్భంగా సీతారామలక్ష్మణులకు, ఆంజనేయ స్వామికి, సూర్య భగవానుడికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని, భక్తులు ఈ పూజలలో పాల్గొనాలని పేర్కొన్నారు. అర్చకులు పేర్కొన్నారు.

వైఎస్ఆర్ సీపీ విజయానికి కృషి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ శేఖర్, తులసి యాదవ్

పాలసముద్రం: వైఎస్ఆర్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, వైస్‌ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసి యాదవ్ తెలిపారు. బుధవారం అముదాలలో ఎంపీటీసీ లిఖిత, సర్పంచ్ అనురేఖ సమక్షంలో వైఎస్ఆర్ సీపీ శ్రేణులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసి మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల్లో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులే జగనన్నకు క్యాంపెయినర్లుగా నిలవనున్నారన్నారు. సంక్షేమ పాలన కొనసాగిస్తున్న జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు నియోజకవర్గంలో వైఎస్ఆర్ సీపీ జెండాను మరోసారి ఎగురవేయాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ పచ్చ పార్టీ నేతలు చెప్పే కథలను నమ్మొద్దని ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రజా సంక్షేమం అందించే విషయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించార న్నారు. బలిజకండ్రిగలో జరిగిన వైఎస్ఆర్ సీపీ ఆత్మీయ సమ్మేళనం, బైక్ ర్యాలీని విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు ఎన్నికల వరకు ఉత్సాహం నింపాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందరాజ్, నాయకులు చంద్రశేఖర్‌రాజు, షణ్ముగరెడ్డి, సుమన్, వేణు, అరుల్, కుట్టి, నరసింహనాయుడు, కుమార్, వరదరాజు, తిరుమల, రవిరెడ్డి, సురేష్, రాజామణి పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దీప

నింద్ర: వేసవిలో మండలంలో తాగునీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దీప ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మట్లాడుతూ అవసరమైన చోట్ల కొత్త బోర్లు వేయాలని, చెడిపోయిన వాటికి మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఏవో తులసీరామ్ మాట్లాడుతూ మండలంలో రైతులకు 260 టన్నుల ఎరువులు పంపిణీ చేసినట్లు తెలిపారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని పాడి రైతులకు పశువుల బీమాతోపాటు పశు ఆరోగ్య కార్డులు అందజేసినట్టు తెలిపారు. కోఆప్షన్ సభ్యుడు అనిల్ మాట్లాడుతూ రాత్రిళ్లు కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు అందించాలని కోరారు. ఎంఈవో శ్రీధర్‌రాజు మాట్లాడుతూ నాడు–నేడు పథకం కింద 35 పాఠశాలల భవనాలకు మరమ్మతులు చేసినట్లు తెలిపారు. ఉపాధి ఏపీవో ఇందుమతి మాట్లాడుతూ ఉపాధి ద్వారా 35 మంది రైతులకు ఉద్యాన పంటలు సాగు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కావునూరు గ్రామంలో తాగునీరు బోరు వేయాలని ఎంపీటీసీ విజేష్ కోరారు. మండలంలో రిసర్వే పనులు 9 గ్రామాల్లో పూర్తి అయినట్లు తహసీల్దార్ నాగమణి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శుభ, ఎంపీడీవో భవాని, హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు, ఏపీఎం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో వైకల్యం నయం



పిల్లలకు ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ అనూష

పాలసముద్రం: మండల పరిధిలోని అంగవైకల్యం కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ వ్యాయామంతోనే అంగవైకల్యం నయం చేసుకోవచ్చని ఎంఈవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం పాలసముద్రం భవితకేంద్రంలో ఫిజియోథెరపిస్టు అనూష 9 మంది అంగవైకల్యం కలిగిన పిల్లలకు ఫిజియోథెరపీ చేశారు. చిన్నారుల తల్లిదండ్రులతో డాక్టర్ అనూష మాట్లాడుతూ కుర్చోవడానికి, నిలబడడానికి, నడవడానికి ఇబ్బంది పడే పిల్లలకు భవిత కేంద్రంలో ఉచితంగా ఫిజియోథెరపీ చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని అంగవైకల్యం కలిగిన పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు



ఉత్తమ డ్రైవర్‌కు సన్మానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్టీసీ డీపోలో బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎంవీఐ దామోదర్ నాయుడు, ఆర్టీసీ డిపో మేనేజరు రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని తెలిపారు. డ్రైవింగ్‌లో ఉత్తమ ప్రతిభ చాటిన జి.వెంకటేశ్వర్లుకు రూ.వెయ్యి, జీవీ సుబ్బయ్యకు రూ.750, డి.నాగరాజుకు రూ.500 ప్రోత్సాహక నగదు బహుమతి అందజేసి, సత్కరించారు. చక్రవర్తి, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పలు యూనియన్ల నాయకులు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా సౌకర్యాలు



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేర పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పక్కాగా ఉండాలని ఏఈఆర్వో, నగర కమిషనర్ అరుణ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ నగర పాలక సంస్థ పరిధిలోని బుధవారం ఉదయం 1, 2, 3, 4, 50, 40 వార్డు పరిధిలో 11, 7, 8, 12, 13, 18, 19, 20, 24, 9, 10, 27 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో ఇటీవల చేపట్టిన పనులను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుదీకరణ పనులను తనిఖీ చేసి లైట్లు, ఫ్యాన్లు సక్రమంగా పనిచేస్తున్నాయా అని పరిశీలించారు. నీటి సరఫరా, మరుగుదొడ్లకు నీటి సౌకర్యం, ఫర్నిచర్, ర్యాంపుల నిర్మాణాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల ఆవరణాల్లో ఇతరత్రా మెటీరియల్ లేకుండా చూడాలన్నారు. ఎంఈ గోమతి, డీఈలు వెంకటప్రసాద్, రమణ, ఏఈలు రజని, లోకేష్, రవీంద్ర, బీఎల్వోలు, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.